## పరిచయం

# "రక్షింపబడుటకు నేనేమి చేయవలెను?"

*"దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను" (యోహాను 3:16).*

"రక్షింపబడుటకు నేనేమి చేయవలెను?" లోకమంతటిలో దీనికంటె ముఖ్యమైన ప్రశ్న ఏదీ లేదు. ఆత్మ యొక్క నిత్య గమ్యం యిరకాటంలో ఉన్న సంగతిని ఒకడు ఆలోచన చేసినప్పుడు, ప్రతివిధమైన ప్రశ్న ప్రాముఖ్యతను కోల్పోతుంది (కాంతిహీన మౌతుంది).

## ఎవరు రక్షింపబడగలరు?

యేసుక్రీస్తునందు విశ్వసించి, విధేయులైనవారికి మాత్రమే రక్షణ వాగ్దానం చేయబడింది. యేసును గూర్చి పేతురు యిలా ప్రకటన చేశాడు, "మరి ఎవనివలనను రక్షణ కలుగదు; ఈ నామముననే మనము రక్షణ పొందవలెను గాని, ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము" (అపొస్తలుల కార్యములు 4:12). ప్రభువైన యేసు యిలా చెప్పారు, "కాగా మీ పాపములలోనేయుండి మీరు చనిపోవుదురని మీతో చెప్పితిని. నేను ఆయనని మీరు విశ్వసించనియెడల మీరు మీ పాపములోనేయుండి చనిపోవుదురు" (యోహాను 8:24). "-ప్రభువా, ప్రభువా, అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోక రాజ్యములో ప్రవేశింపడుగాని పరలోకమందున్న నా తండ్రి చిత్తప్రకారము చేయువాడే ప్రవేశించును" అని కూడ ఆయన అన్నారు (మత్తయి 7:21).

ఒక మనుష్యుడు ఎంత యథార్థవంతుడు నిష్కపటియైనా సరే, మానవ మనస్సులో పుట్టిన రక్షణ సంకల్పాన్ని అంగీకరించకూడదు. పాప మానవాళిని రక్షించడానికి ఏర్పాటు చేసే సంకల్పము దేవునికి మాత్రమే చెందినదైయుంటుంది. రక్షింపబడడానికి ఏమి చేయాలో ఒకడు తెలిసికొనగోరితే, క్రొత్త నిబంధనలో దేవుని సంకల్పాన్ని తెలియజేసిన ప్రభువైన క్రీస్తు సందేశాన్ని అంగీకరించాలి.

## అందరు రక్షింపబడాలని ప్రభువు కోరుతున్నారు

దేవుడు నరుని ప్రేమించి వాని రక్షణను ఆయన ఎంతగా కోరుకున్నాడంటే, మానవాళి పక్షంగా తన సొంత కుమారుని మరణానికి సైతం సమ్మతించాడు (యోహాను 3:16). విధేయుడైన ఏ వ్యక్తియైనా రక్షింపబడడానికి వీలు కలుగునట్లు దేవుని కుమారుడైన యేసు సిలువ వేదనను సహించునంతగా మానవ రక్షణను కోరాడు (హెబ్రీయులకు 12:2). యేసు మృతినొంది, సమాధి చేయబడి, అటు తరువాత మృతులలోనుండి లేపబడ్డాడు (1 కొరింథీయులకు 15:3, 4). పరలోకానికి తిరిగి వెళ్లక ముందు, జనులు రక్షింపబడడానికి ప్రకటించవలసిన సందేశాన్ని యేసు అపొస్తలులకు యిచ్చారు. ఈ ఆదేశాన్ని మనం సాధారణంగా గ్రేట్ కమిషన్ అని అంటాం. అది క్రొత్త నిబంధనలో మూడు చోట్ల దాఖలు చేయబడింది:

> కాబట్టి మీరు వెళ్లి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రియొక్కయు కుమారునియొక్కయు పరిశుద్ధాత్మయొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు నేను మీకు ఏ యే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగసమాప్తివరకు సదాకాలము మీతో కూడ ఉన్నానని వారితో చెప్పెను (మత్తయి 28:19, 20).

> మరియు – మీరు సర్వలోకమునకు వెళ్లి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మని వానికి శిక్ష విధింపబడును (మార్కు 16:15, 16).

> –క్రీస్తు శ్రమపడి మూడవ దినమున మృతులలోనుండి లేచుననియు యెరూషలేము మొదలుకొని సమస్త జనములలో ఆయనపేరట మారుమనస్సును పాపక్షమాపణయు ప్రకటింపబడుననియు వ్రాయబడియున్నది (లూకా 24:46, 47).

రాబోయే వరుస పాఠాలలో, అపొస్తలులు ఈ ఆదేశాన్ని నెరవేర్చుతుండగా విధేయతతో ప్రజలు ఎలా ప్రత్యుత్తరమిచ్చారో ఉదాహరణలను మనం చూద్దాం.